# రచయిత్రి పరిచయం

పుట్టి పెరిగింది పి.జి. వరకు చదివింది అంతా హైదరాబాదులోనే! ఎ.పి. బివరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం! శ్రీవారు HIL లో సీనియర్ సిస్టమ్స్ ఆఫీసర్, ఇద్దరు అబ్బాయిలు, అమెరికాలో ఉన్నారు. నాకు చిన్నప్పట్నుంచి వ్రాయడం అంటే చాలా ఇష్టం. అలాగే ఎక్స్ట్రా కరికులర్ యాక్టివిటీస్‌లోనూ చాలా యాక్టివ్‌గా పాల్గొనేదాన్ని. సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్, సికింద్రాబాద్‌లో చదువుతున్నప్పుడు, దాదాపు అన్ని సంవత్సరాల్లోనూ తెలుగు ఎలొక్యూషన్, ఎస్సే రైటింగ్, తెలుగు డ్రామా ఇలా అన్ని విభాగాల్లోనూ చాలా మటుకు ఫస్ట్ ప్రైజ్‌లన్నీ నావే!

అలా నా చిన్నప్పుడే నాకు తెలుగు భాష పట్ల మమకారం కలుగజేసింది, రేడియో ఆర్టిస్ట్ అయిన మా అమ్మగారు శ్రీమతి హైమావతి గారు అయితే, సనత్‌నగర్ లైబ్రరీ నుంచి భారత రామాయణాలు దగ్గర్నుంచి కాశీమజిలీ కథలు వరకు, అన్ని పుస్తకాలు తెచ్చి నాకు చదివి వినిపించి నాలో తెలుగు సాహిత్యం పట్ల జిజ్ఞాస కలిగించింది, తూర్పుగోదావరి జిల్లా, "మల్లాం" గ్రామ వాస్తవ్యులు, స్వాతంత్ర్య సమరయోధులు, మా తాతగారు కీ.శే. శ్రీ మల్లాల వియ్యరాజు గారు! వారి స్ఫూర్తే నన్ను కవితల దగ్గర్నుంచి కథల వరకు నడిపించింది! అందుకే ఇప్పటికి ఏ పుస్తకం కనిపించినా అది చదివేవరకు వదిలిపెట్టను!

అడుగేస్తే కందిపోతానేమో అన్నంత అపురూపంగా తన గుండెల మీద పెట్టుకుని నన్ను పెంచిన ప్రముఖ రంగస్థల నాటక దర్శకులు, ప్రయోక్త, నటులు, సినీ, టీ.వీ., రేడియో కళాకారులు అయిన మా నాన్నగారు కీ.శే. శ్రీ ఎం.వి. రామారావు గారు ఇటు సాహిత్య రంగంలోనూ, అటు ఉద్యోగ, సంసార ప్రస్థానంలోనూ నాకు బంగారు బాట పరిచిన మార్గదర్శకులు వారు! ఉమ్మడి కుటుంబంలో పుట్టి పెరగడం వల్ల నేను అనుబంధాల పట్ల విలువ ఎక్కువగా ఇస్తాను!

గత పాతికేళ్లుగా రేడియో, దూరదర్శన్ గ్రేడెడ్ ఆర్టిస్ట్‌ని! ఆర్టికల్ రైటర్‌ని! నేను రాసిన స్కిట్లు నాటకాలు, స్కిట్లు కథలు అనేక తెలుగు సాంఘిక నాటకాలు, కథానికలు ప్రసారం కాబడ్డాయి. వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి! దూరదర్శన్‌లో 'స్త్రీల కార్యక్రమాలు, 'ఆరోగ్య' కార్యక్రమాలు, 'ఈ వారం అతిథి', 'న్యాయ సలహాలు' (లైవ్-ఫోన్ ఇన్ ప్రోగ్రామ్) ఇలా ఎన్నో చేసినా, 'సాహిత్య' కార్యక్రమంలో అనేక మంది సాహితీ ప్రముఖుల్ని ఇంటర్వ్యూ చేయడం, వారితో చర్చల్లో పాల్గొనడం నాకు అత్యంత సంతృప్తి నిచ్చిన విజయం!

2006 లో తొలి కథ "అరుగు" తో ప్రారంభమై, 70కి పైగా కథలు అన్ని ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. రెండు సీరియల్స్ 'సంధ్యా రాగం' 'లక్ష్యం' 'నవ్య' వారపత్రికల్లో ప్రచురింపబడ్డాయి!

"కంటి రెప్ప" కథ 'స్వాతి' వార పత్రికలో రూ.5,000/-ల బహుమతి పొందిన కథ!! 'నివాళి' కథ వంగూరు ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన మొట్టమొదటి అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల కథల పోటీల్లో రూ. 5,000/- బహుమతి పొందిన కథ.

'ఒంటరి నక్షత్రం' కథల సంపుటి, 'సంధ్యారాగం' నవల ప్రచురింప బడ్డాయి.

**- శ్రీమతి కె. వాసవదత్త రమణ**
ఎస్.ఆర్.టి. 750, ఫ్లాట్ నెం.201,
సనత్‌నగర్, హైదరాబాద్-500 018.
సెల్ 98481 78962.

E-mail: vasuramana@gmail.com